అందుకే వెళ్లింది. శివతత్త్వం గొప్పదనం ఏంటో తండ్రికీ, ఆ యాగానికి వచ్చిన దేవతలందరికీ విశదీకరించి.. యాగాగ్నికి ఆహుతి అవుతుంది. సతి లేదన్న విషయం తెలిసి శివుడి మతి తప్పుతుంది. ఆమె కళేబరాన్ని భుజాన వేసుకొని కరాళ నృత్యం చేస్తాడు. చక్రి తన సుదర్శనంతో అమ్మ శరీరాన్ని ఖండిస్తాడు. ఆ శరీర భాగాలు పడిన ప్రతిచోటూ శక్తిపీఠమైంది. ఆ దివ్యక్షేత్రాలు నేటికీ భక్తుల పాలిట కొంగుబంగారమై అలరారుతున్నాయి. వారి సంయోగమే కాదు, వియోగం కూడా బిడ్డలకు వరమే! అదే ఆదిదంపతుల కరుణ!! అమ్మ వెలసిన ప్రతిచోటా ఆయనా ఏదో రూపంలో నిలిచాడు. భ్రమరాంబ సన్నిధిలో మల్లన్నగా, విశాలాక్షి వాకిట విశ్వనాథుడిగా ఇలా ఆమె వెంటే ఉండిపోయాడు.

***

సతీ వియోగంతో కైలాసాన్ని వదిలేశాడు శివుడు. శ్మశానాలు పట్టుకుని తిరగడం మొదలుపెట్టాడు. విరహంలో కూరుకుపోయాడు. విరాగిగా మారిపోయాడు. శక్తి లేదు.. ఆసక్తి రాదు. తపస్సులో మునిగి స్థాణువయ్యాడు. మరోవైపు హిమవంతుడి ఇంట పరాశక్తి పుట్టింది. మేనకాదేవి ఆలనాపాలనలో పార్వతిగా పెరిగింది. శివుణ్ని చేరుకోవడమే ఆమె లక్ష్యం. అనుకోకుండా ధ్యానశివుడికి శుశ్రూషలు చేసే అవకాశం వచ్చింది. మూడు కన్నులున్నా.. క్రీగంట కూడా ముదితను చూడడే! చిన్నబుచ్చుకుంది పార్వతి. తన ప్రాసాదానికి వెళ్లిపోయింది. దివారాత్రులూ విలపిస్తూనే ఉండిపోయింది. విషయం తెలుసుకొని వచ్చాడు నారదుడు. 'ఆయనలో సగమైన నీకు.. శివుడు అర్థమైంది ఇంతేనా తల్లీ?' అని ప్రశ్నించాడు. శంకరుణ్ని భక్తితో వశం చేసుకోవాలి కానీ, అందచందాలతో అది సాధ్యమయ్యేదేనా అని బోధిస్తాడు. కఠోర తపస్సుకు పూనుకొంటుంది పార్వతి. ఆమె భక్తి ఏపాటిదో తెలుసుకోవాలని కపట బ్రహ్మచారిగా వస్తాడు హరుడు. శివుడి గురించి లేనిపోనివన్నీ చెప్పాడు. 'ఏనుగు తోలు చుట్టుకుంటాడు, శ్మశానాల వెంట తిరుగుతాడు, కపాల హారం ధరిస్తాడు, పాములు చుట్టుకుంటాడు..' అని ఇలా నానాయాగీ చేస్తాడు మాయదారి శివుడు. అప్పటికే తపస్సుతో పరమేశ్వరుడి తత్త్వం సంపూర్ణంగా గుర్తెరిగిన పార్వతి అవేం పట్టించుకోదు. కైలాసనాథుడే తన నాథుడు అని చెబుతుంది. భార్యాభర్తల బంధంలో బాహ్య సౌందర్యం ప్రధానం కాదు, అంతర్ సౌందర్యం, వ్యక్తిత్వమే ముఖ్యమని శివపార్వతులు జంటగా చూపించిన లీల ఇది.

* * *

పార్వతిని చేపట్టడానికి శివుడు అంగీకరించాడని హిమవంతుడు పొంగిపోతాడు. దేవాదిదేవుడు తమ ఇంటికి అల్లుడు అవుతున్నాడని మేనకాదేవి సంతసిస్తుంది. పెళ్లి రాయబారానికి సప్తరుషులు వస్తారు. శివలీలల్ని ప్రస్తుతిస్తారు. శివపార్వతుల కల్యాణానికి ముహూర్తం నిర్ణయమైంది. ఎప్పుడూ కరి చర్మం చుట్టుకునే శివయ్య పెళ్లినాడు పట్టుపుట్టం కట్టుకున్నాడు. జడలు కట్టిన కేశాలను సంస్కరించుకున్నాడు. తన ఒంటికి చుట్టుకున్న నాగులను వదిలిపెట్టి కంకణాలు ధరించాడు. ప్రమథ గణాలనూ పద్ధతిగా తయారవ్వమని ఆదేశించాడు. ముక్కోటి దేవతలు తోడుగా ఆడపిల్ల ఇంటికి తరలివెళ్లాడు! ఇంతమంది ఎంతో గొప్పగా చెప్పిన శివుణ్ని చూడాలని మేనకాదేవి ఆరాటపడుతుంది. అదేమాట నారదుడిని కోరుతుంది. దానిదేముంది అని రాజప్రాసాదం పైకి వెళ్లారిద్దరూ. దేవతలంతా ఆనందపరవశులై తరలి వస్తున్నారు. అందులో నలకుబేరుణ్ని చూసి 'ఆయనేనా శివుడు' అంది మేనకాదేవి. 'అతను కుబేరుడి కొడుకు.. ఇతగాడి అందం ఆ మహనీయుడి కాలిగోటికి సరిపోదు' అన్నాడు నారదుడు. పొంగిపోయింది మేనకాదేవి. ఇంద్రుణ్ని చూసి ఈయనేనా అని అడిగింది. 'ఈయనకు కోట్ల రెట్ల అందం ఆయనది' అన్నాడు నారదుడు.

## ఎంత నమ్మకమో..

'ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది' అన్న మాట తొలిగా రుజువైంది పార్వతీపరమేశ్వరుల విషయంలోనే కావొచ్చు. దేవదానవులు క్షీరసాగరాన్ని మథించినప్పుడు మొదట హాలహలం ఉద్భవించింది. పొగలు చిమ్ముతూ, నిప్పులు కక్కుతూ ప్రపంచాన్ని ముంచేస్తున్న గరళాన్ని చూసి అందరూ 'హరహరా' అంటూ మొరపెట్టుకున్నారు. శివుడు ఆ విషాన్నంతా నేరేడు పండంత పరిమాణం చేసి చేతిలోకి తీసుకున్నాడట. అప్పుడు పార్వతితో 'మింగేయమంటావా?' అని అనుమతి కోరాడట. 'ఏం ఫర్వాలేదు కానీ' అందట అమ్మవారు. శివుడు ఆ విషాన్ని గుటుక్కున మింగి కంఠంలోనే భరించాడు. గౌరీదేవి మాంగళ్యంపై ఆయనకున్న నమ్మకం అది. మంగళకరుడైన శివుడిపై ఆమెకున్న విశ్వాసం అది. అంతే కాదు, ఏదైనా పని చేసేముందు జీవిత భాగస్వామికి ఒక మాట చెప్పడం ధర్మమని ఈ సందర్భం మనకు విశదపరుస్తుంది.



## ఆమెదే గెలుపు

ఆదిదంపతుల సంసారంలోనూ అరమరికల్లేకుండా లేవు. ఓసారి గిల్లికజ్జాల స్థాయిలో ఉంటే, ఒక్కోసారి చిలికిచిలికి గాలివాన అయిన సందర్భాలూ ఉన్నాయి. పరమేశ్వరుడు కర్పూరమంత తెల్లగా ఉంటాడు. పార్వతేమో.. కాటుకంత నలుపు మనిషి. ఓసారి పార్వతి వంక చూస్తూ.. 'కాళీ.. నల్లదానా' అన్నాడట శంకరుడు. అందరి ముందు అలా అనడంతో ఆమె కస్సుమంది. దిగ్గునలేచి.. తపస్సుకు పూనుకొంది. బ్రహ్మదేవుడికై తపస్సు ఆచరించి.. ఆయన అనుగ్రహంతో స్వర్ణకాంతులీనే దేహాన్ని సంతరించుకుంది. బంగారు వన్నెలో మెరిసిపోతున్న అమ్మను చూసి.. శివుడు మరింత మురిసిపోయాడు. 'గౌరీ!' అంటూ పార్వతిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నాడట.ఇంకోసారి ప్రమథ గణాలు శివుణ్ని తెగ పొగిడాయట. ఉబ్బితబ్బిబ్బయిన శంకరుడు పక్కనే ఉన్న పార్వతి వంక కాస్త గర్వంగా చూశాడట. పెనిమిటి ఆంతర్యం గ్రహించిన అమ్మవారు సర్లే అనుకుందట! తన చేతిలోని ఐదు రంధ్రాలు ఉన్న రత్నాల బంతిని భర్తకు ఇచ్చి.. అందులోకి చూడమన్నదట. యథాలాపంగా చూశాడు శివుడు. అందులో ఐదు బ్రహ్మాండాలు, ఐదు కైలాసాలు, ఐదుగురు శంకరులు కనిపించారట. అప్పుడు గానీ, అమ్మవారి శక్తి ఏపాటిదో అయ్యకు అర్థం కాలేదు. భార్యాభర్తల్లో ఒకరు హెచ్చులకు పోయినప్పుడు మరొకరు యుక్తిగా నెగ్గుకు రావాలని ఈ సన్నివేశం బోధిస్తుంది.

